

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# నల్లమల్లలో చెలరేగిన మంటలు...

### అదుపులోకి తీసుకొచ్చిన ఫారెస్ట్ సిబ్బంది



మంటలను అదుపులోకి తీసుకొస్తున్న సిబ్బంది

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ రేంజ్ దోమలపెంట నల్లమల్ల అడవిప్రాంతంలో వజ్రాలమడుగు తావిసి పెంట సమీపంలో కార్చిచ్చు రాజేసుకుంది. గురువారం తెల్లవారు జామున నుంచి మధ్యాహ్నంవరకు అడవిలో ఉప్పెనల ఎగసిపడిన మంటలను అడవిశాఖ సిబ్బంది శ్రమించి అదుపులోకి తీసుకొచ్చిన సంఘటన బ్రహ్మగిరిఅడవుల్లోని తాటిగుండాల వజ్రాల మడుగుప్రాంతంలో చోటుచేసుకుంది. అమ్రాబాద్ డివిజన్‌లోని మన్ననూర్ బ్రహ్మగిరిరేంజ్ పరిధిలో దాదాపు 30హెక్టార్లు నుండి 40హెక్టార్ల వరకు అడవిప్రాంతం కాలిపోయినట్లు ఎఫ్ఆర్ఓ సమాచారమిచ్చారు. అడవిలో ఎక్కువశాతం ఎండుగడ్డి మరియు పర్యాటకుల నిరక్ష్యంవల్ల మంటలు ఉధృతమవుతున్నాయన్నారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో అభయ అరణ్యంలో మంటలు ప్రత్యేకించి బ్రహ్మగిరి రేంజ్ లో రాత్రి వేళలో కొనసాగడం సహజమైంది. పర్యాటకులు, వాహనదారులు మరియు పశువులకాపరుల నిర్లక్ష్యం వల్ల మంటలు వ్యాపిస్తున్నాయన్నారు.. అడవిని సంరక్షించడం కోసం సకల ప్రయత్నాలు చేస్తున్నామని, అందులో భాగంగానే స్పెషల్ టాక్స్ z ఫోర్స్‌కు సాటిలైట్ సమాచారం వెంటనే సిబ్బందిని అలెర్ట్ చేసి 8 గంటలపాటు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చామని, ప్రస్తుత పరిస్థితి సద్దుమణిగిందన్నారు. అయితే అడవిలో కొందరు బాటసారులు నిప్పురవ్వ వేయడం వల్ల కారు చిచ్చు ప్రమాదం సంభవించి ఉండవచ్చునన్నారు. కేవలం గడ్డి మాత్రమే కాలిపోయింది కానీ ఎలాంటి వృక్ష, జంతుప్రాణహాని జరగలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


# కష్టాలు కన్నీళ్లు చూసా..

తాను చిన్నప్పటినుంచి అన్ని కష్టాలే.. నాన్న హమాలీ పని చేస్తూ ఇద్దరు తమ్ముళ్ళని తనను చేతనైన వరకు చదివించారు.. ఆపై స్తోమత లేక పదవ తరగతి పూర్తయ్యాకే పెళ్లి చేశారు.. అప్పుడు తొలత కష్టాలు తప్పలేదు.. అయినా ఏనాడు వెనకడుగు వేయలేదు.. ఏదో ఒక పని చేసుకుంటూ ధైర్యంగా ముందుకే సాగారు. కాలమే వారికి ఓ దారి చూపించింది.. ఇల్లు అద్దెకు ఇస్తే రెంటు కడతారో లేదో అని అద్దెకు కూడా ఇవ్వడానికి నిరాకరించిన పరిస్థితుల నుంచి నేడు మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా ఎన్నికై, తొలి మేయర్ గా ఏకగ్రీవం అయిన గుమాల్ మమత శ్రీనివాసుతో వార్త ప్రత్యేక కథనం.

**– మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**

- ఏది మంచి ఏది చెడు తెలుసు..అద్దె కట్టలేమని మాకు ఇల్లు కిరాయి ఇవ్వలేదు
- మనం మంచి చేస్తే తిరిగి మంచే జరుగుతది..
- మా ఆయన నుంచి అన్నీ నేర్చుకుంటున్నా..
- కుటుంబ బాధ్యత నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి..
- మహబూబ్‌నగర్ కార్పొరేషన్ తొలి మేయర్ గుమాల్ మమత





మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని మూడవ డివిజన్ అప్పన్నపల్లి కి చెందిన గుమాల్ మమత శ్రీనివాస్ మహబూబ్‌నగర్ మేయర్ పీఠం దక్కించుకున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరులోనే కాదు రాష్ట్రంలోనూ ఆమె పేరు అందరి నోటా నానింది. కార్పొరేటర్ అయితే చాలు అనుకున్న ఆమెను ఏకంగా మేయర్ పీఠం వరించడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. భర్త చాటు భార్యగా జీవితం కొనసాగిస్తూ, రాజకీయాలను అవగాహన చేసుకుంటూ, ఆయన అడుగుల్లో అడుగు వేస్తూ సమాజానికి పరిచయం అయిన మమత నేడు మహబూబ్‌నగర్ కార్పొరేషన్ తొలి మేయర్ పీఠాన్ని అధిష్టించడం పాలమూరు రాజకీయాల్లోనే పెద్ద మలుపుగా చెప్పవచ్చు. మొగులయ్య, కౌసల్య దంపతులకు ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కుమారులు కూతురు మమత ఉన్నారు. నాన్న మొగులయ్య హమాలీ పని చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తుండేవారు. కుటుంబ పోషణ భారం కావడంతో పదో తరగతి పూర్తి అయిన వెంటనే మమతకు శ్రీనివాస్ తో వివాహం జరిపించారు. వారికి ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. ఇక కష్టాలు ఒక్కొక్కటిగా పెరిగి కుటుంబ వ్యవస్థ ఇబ్బందులు పడుతున్న రోజుల్లో ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇల్లుతో పాటు ఉన్న భూమిని సైతం అమ్మేశారు. తదనంతరం డబ్బులు లేకపోవడంతో ఇంటి రెంటు కూడా కడతారో లేదో అని ఎవరు అద్దెకు ఇవ్వని పరిస్థితులను కూడా దగ్గరుండి చూశారు. అయినా అధైర్య పడలేదు. అక్కడ ఇక్కడ తెలిసిన వాళ్ళ దగ్గర అప్పు చేసి ఒక జెసిబి ని కొనుగోలు చేశారు. మెల్లగా చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ తాను కోల్పోయింది ఒక్కొక్కటిగా తిరిగి సొంతం చేసుకొంటూ వచ్చారు. ఇంకా ఎక్కడ వెను తిరిగి చూడలేదు. తాను సంపాదించిన కొంత మొత్తంలో గ్రామ అభివృద్ధికి, పాఠశాలలకు అందిస్తూ వచ్చారు.

### ఎమ్మెల్యే యెన్నం సహకారంతో..

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ను అన్ని విధాలుగా ముందు ఉంచేందుకు ఎమ్మెల్యే యెన్నం సహకారంతో అడుగులు వేస్తామని మేయర్ మమత చెబుతున్నారు. ఎమ్మెల్యే యెన్నం ఇప్పటికే విద్య వైద్యంలో మహబూబ్‌నగర్ ను రాష్ట్రస్థాయిలో నెంబర్ వన్‌గా చేయడమే లక్ష్యంగా సాగుతున్నారు. ఆయన ఆశయంలో తాము కూడా భాగస్వాములమై ఇతర మౌలిక వసతుల కల్పనకు శాయశక్తుల కృషి చేస్తామని తెలిపారు.

### మా ముందు ఒక్కటే లక్ష్యం..

మేయర్ పీఠం మమ్మల్ని వరించడం చాలా అదృష్టంగా భావిస్తున్నాం. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన మాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మేయర్‌గా అవకాశం కల్పించడం ఒక గొప్ప వరంగా భావిస్తున్నాం. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ లోని 60 డివిజన్లను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా చేయడానికి శాయశక్తుల కృషి చేస్తాం. డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి సహకారంతో అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. మేయర్ పీఠం పదవిగానే కాకుండా అతిపెద్ద బాధ్యతగా నేను భావిస్తున్నా. మా ఆయన గత 15 సంవత్సరాలుగా రాజకీయంలో ఉన్నారు. గతంలో కౌన్సిలర్ గా పోటీ చేసి ఓడిపోయారు. మాకు రాజకీయంలో ఏ పదవి లేకున్నా మాకు తోచినంత మేర అభివృద్ధి కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చాం. ఇక మీదట కూడా చేస్తూనే ఉంటాం.. కార్పొరేషన్ లోని 60 డివిజన్‌లలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేయడం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేయడం తక్షణ కర్తవ్యంగా ముందుకు సాగుతాం. ప్రతి డివిజన్లో పర్యటించి సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రతి డివిజన్ మాపై నమ్మకం ఉంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన మూడో డివిజన్ ప్రజలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు.

**- గుమాల్ మమతా శ్రీనివాస్, మేయర్, మహబూబ్‌నగర్ కార్పొరేషన్**



డాగ్ స్క్వాడ్ ట్రాకర్ మాయతో కరచాలనం చేస్తున్న జిల్లా ఎస్పీ

### నేర ఛేదనలో నూతన శక్తి

# వనపర్తి డాగ్ స్క్వాడ్

- కొత్త ట్రాకర్ శునకం "మాయ" చేరిక : జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- నేరస్థుల అడుగుజాడల ఆధారాలు
- గుర్తింపులో ట్రాకర్ "మాయ " ప్రత్యేక ప్రావీణ్యం
- 8 నెలల కఠోర శిక్షణ పూర్తి ఫీల్డ్ విధులకు సిద్ధం
- నేర దర్యాప్తులో కీలక దిశానిర్దేశం అందించనున్న శునక దళం

**వనపర్తి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పోలీసు విభాగానికి భద్రతా పరంగా మరింత బలాన్ని చేకూర్చే దిశగా, దొంగతనాలు, హత్య కేసుల విచారణలో కీలక ఆధారాలను వెలికితీయగల ట్రాకర్ శునకం మాయ" నూతనంగా వనపర్తి పోలీసులో చేరినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. 8 నెలల పాటు ప్రత్యేక కఠిన శిక్షణను పూర్తి చేసుకున్న డాగ్ హాండ్లర్ కానిస్టేబుల్ దేవ్యానాయక్, గురువారం రోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ సమీపంలోని పోలీస్ డాగ్ ట్రైనింగ్ సెంటర్, ఐటీపీఏ మోహినాబాద్‌లో నిర్వహించిన శిక్షణలో ట్రాకర్ శునకం మాయ" ప్రదర్శించిన సామర్థ్యాలు, ఫీల్డ్‌లో దాని పనితీరు తదితర అంశాలను ఎస్పీకి శిక్షణ కాలంలో మాయ" – మిగతా4లో..



నూతన గృహ లబ్ధిదారులతో ఎమ్మెల్యే

### ఇందిరమ్మ రాజ్యంలో నేరవేరుతున్న

# పేదోడి సొంతింటి కళ

**- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. పేదవాడి సొంత ఇంటి కళను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కళ సహకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌళిక సదుపాయాలను కూడా దశలవారీగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతా నరసింహ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వారంలో మరమ్మతు పనులు పూర్తి చేయాలి

- ఆసుపత్రిలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి
- రోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి
- రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఫ్యాన్లు, లైట్లు ఎందుకు పనిచేయడం లేదు.. టాయిలెట్లు ఎన్ని మరమ్మత్తుల్లో ఉన్నాయి.. నీటి నల్లాల కనెక్షన్లు ఎందుకు ఇవ్వలేదు.. ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు ఎందుకు పూర్తికాలేదు అంటూ కలెక్టర్ విజయేంద్రబోయి ప్రశ్నించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వివిధ మెడికల్ వార్డులను సందర్శించి, రోగులు, వైద్య అధికారులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర విషయాలు తెలుసుకున్నారు. 18 టాయిలెట్లు మరమ్మత్తులో ఉన్నాయని, నిధుల లేమి కారణంగా 32 చెల్లింపు గదుల మరమ్మత్తులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. వెంటనే ఎలక్ట్రికల్, ప్లంబింగ్, డ్రైనేజీ పనులను పూర్తి చేసి వచ్చే వారంలోగా చెల్లింపు గదులను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని. జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలోనే అత్యుత్తమ ఆసుపత్రిగా తీర్చి దిద్దాలని అధికారులను ఆదేశించారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ ముందుగా ఎమర్జెన్సీ మెడికల్ వార్డును సందర్శించారు. అక్కడ రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకే పడకపై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించి, వారికి ఎందుకు వేరు వేరు బెడ్లు ఇవ్వలేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ వార్డులో 24 గంటలు ఎంత మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారని అడగగా, ఇద్దరు చీఫ్ మెడికల్ ఆఫీసర్లు సేవలందిస్తున్నారని అధికారులు తెలిపారు. తదుపరి ఐసీయూ విభాగాన్ని సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. ఆర్థోపెడిక్ విభాగంలో రోజుకు ఎన్ని శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని ప్రశ్నించగా, రోజుకు 3 నుంచి 5 వరకు శస్త్రచికిత్సలు – మిగతా4లో..



విద్యార్థుల కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

### విద్యార్థులకు నాణ్యమైన

# విద్యను అందించాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నర్వ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నర్వ మండల పరిధిలోని పెద్ద కడ్మూర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న విద్యా బోధనలను స్వయంగా పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సౌకర్యాలు, పరికరాలు, విద్యార్థుల పురోగతి, మధ్యాహ్న భోజనం నాణ్యత, పీఎం శ్రీ స్కూల్ పథకం కింద వార్షిక బడ్జెట్ వ్యయం, కొనసాగుతున్న పాఠశాల కార్యక్రమాలు, టాయిలెట్ సౌకర్యాలతో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏఎక్స్ఎల్‌ల్యాబ్, లైబ్రరీ గదులను ఆమె పరిశీలించి వాటి వినియోగం గురించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. రాయికోడ్ గ్రామంలోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించారు, ప్రీస్కూల్ పిల్లలు అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో సంభాషించారు. చిన్నారులతో కరచాలనం చేసి ఉత్సాహ పరిచారు. అంగన్‌వాడీ – మిగతా4లో..



ఎమ్మెల్యేను కలిసిన శ్రీరంగాపూర్ మండల నాయకులు

# శ్రీరంగాపూర్ పై ప్రత్యేక శ్రద్ధ

### యూనియన్ బ్యాంక్ శ్రీరంగాపురం

### మండల కేంద్రానికి వచ్చే విధంగా చేస్తా : ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో జరగవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు శ్రీహరి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డిని తన నివాసంలో కలవడం జరిగింది. ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో శ్రీరంగాపురం మండల కేంద్రానికి వచ్చినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం శ్రీరంగాపురం గ్రామ అభివృద్ధి కొరకు కోరిన నిధులలో భాగంగా రెండు కోట్ల రూపాయలకు ప్రపోజల్స్ ముఖ్యమంత్రి కి ఇవ్వడం జరిగింది. త్వరలోనే అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించాలని తెలిపారు. శ్రీరంగాపూర్ మండలంలోని ప్రతి కాలనీలో సిసి రోడ్లు డ్రైనేజీలు అండర్ డ్రైనేజీలు వేయాలని, వైకుంఠధామం దగ్గర స్మశాన వాటిక కాంపౌండ్ వాలు త్వరలోనే నిర్మించే విధంగా చూస్తానని – మిగతా4లో..

# మట్టి పరీక్ష.. పంటల అభివృద్ధికి తొలి అడుగు

**- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి**





మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతులకు మెరుగైన లాభాలు అందుతాయని, ఈ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి అన్నారు. గురువారం రైతు కమిషన్ బృందం నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం పరిధిలోని వంగూర్ మండలంలోని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి నేతృత్వంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత, నేల నాణ్యత ఆధారంగా ఎరువుల వినియోగ విధానం, సేంద్రియ వ్యవసాయం ప్రయోజనాలపై వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. అనంతరం మినీ కిట్ల పంపిణీ, భూసార పరీక్షలకు సంబంధించిన పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. రైతుల నిర్దేశించి రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి మాట్లాడుతూ పంటల అభివృద్ధి మరియు అధిక దిగుబడుల సాధనలో మట్టి పరీక్ష అత్యంత కీలకమని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు పంటలు విత్తే ముందు తప్పనిసరిగా తమ భూముల మట్టి పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు. మట్టి పరీక్ష ద్వారా భూమిలో ఉన్న పోషక పదార్థాల స్థాయి, పిహెచ్ విలువ, సేంద్రియ పదార్థాల శాతం వంటి కీలక వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సమాచారం ఆధారంగా సరైన ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ మరియు తగిన పంటల ఎంపిక చేయడం సులభమవుతుందని అవసరానికి మించి ఎరువులు వేయడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం కలగడంతో పాటు భూమి సారంపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆయన హెచ్చరించారు. మట్టి పరీక్ష ద్వారా అవసరమైన ఎరువులనే వినియోగించడం సాధ్యమవుతుందని, దీనివల్ల ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో రైతుల ఆదాయాన్ని పెంచేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం అవసరమని, అందులో మట్టి పరీక్ష కీలక పాత్ర పోషిస్తుందని, రైతులు ప్రభుత్వ వ్యవసాయ విభాగం ద్వారా అందుబాటులో ఉన్న మట్టి పరీక్ష సేవలను వినియోగించుకోవాలని, రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఖర్చులను తగ్గించి, స్థిరమైన వ్యవసాయ విధానాలను అనుసరించాలని చైర్మన్ కోదండరామిరెడ్డి పిలుపునిచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ దేశ వ్యవసాయ రంగ అభివృద్ధిలో తొలి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కీలక పాత్ర పోషించారని, దూరదృష్టితోనే హరిత విప్లవానికి బలమైన పునాదులు పడినట్లు తెలిపారు. నేడు దేశంలో రెండు సంవత్సరాలకు సరిపడే ఆహార ధాన్యాల నిల్వలు ఉండటం ఆయన చేపట్టిన విధానాల ఫలితమేనని అన్నారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతను ప్రోత్సహించడం, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలకు ఆయన ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ముఖ్యంగా శ్రీశైలం డ్యాం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు వంటి ప్రాజెక్టుల నిర్మాణం వ్యవసాయ రంగానికి బలాన్ని ఇచ్చాయని వివరించారు. అదేవిధంగా వ్యవసాయ పరిశోధనా సంస్థల స్థాపన ద్వారా రైతులకు శాస్త్రీయ పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఇదే తరహాలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాలతో పాటు, గత పది సంవత్సరాలుగా రైతులకు అందని వ్యవసాయ పనిముట్లను మళ్లీ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారని, రైతులకు అవసరమైన యూరియా ఎరువుల పంపిణీ సమర్థవంతంగా చేపడుతూ రైతులకు వ్యవసాయం లాభ సాటిగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. నల్లమల్ల ప్రాంతమైన అచ్చంపేట నియోజకవర్గ ప్రాంతంలో ముఖ్యమంత్రి స్వగ్రామంలో రైతు కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన భూసార పరీక్ష కార్యక్రమాలను చేపట్టడం ఆయన ప్రత్యేకంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రసాయన ఎరువులను అధికంగా వాడడం వల్ల, కేవలం పంట దిగుబడి తగ్గిపోతుందని మాత్రమే కాదు, పెట్టుబడులు ఎక్కువగా ఖర్చవుతాయని, అలాగే మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం కలగవచ్చని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. పంటలకు సరిపడే వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు ఎరువులను పంటలకు వినియోగించుకోవాలని, రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టిన భూసార పరీక్షలతో వ్యవసాయ రంగంలో మార్పులు వస్తాయని, రైతులకు లాభంతో – మిగతా4లో..

## జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ

### ప్రత్యేక కమీషనర్ సి.హెచ్. ప్రియాంక


సి.హెచ్. ప్రియాంక (ఫైల్)

**వనపర్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జీఓ నం. 252 ప్రకారం రాష్ట్రంలోని అర్హులైన వారికీ అక్రి డిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్. ప్రియాంక తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్, అనుభవజ్ఞులైన జర్నలిస్టులు ప్రత్యేక పోర్టల్ ఐపిఆర్.తెలంగాణ.జిఓవి.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలియజేశారు. దరఖాస్తు, జారీ ప్రక్రియ రోలింగ్ ప్రాతిపదికన కొనసాగుతుంది. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే, దరఖాస్తుదారులు కార్యాలయ వేళల్లో (ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు) 9154170881 నంబర్‌లో మీడియా రిలేషన్స్ వింగ్‌ను సంప్రదించవచ్చు అని కమిషనర్ తెలిపారు.

## విజయ వంతంగా ముగిసిన వైద్య శిబిరం


ఉప్పరిపల్లి లో నిర్వహించిన వైద్య శిబిరం లో వైద్య పరీక్షలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని హైదరాబాద్ లోని ఆర్ష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చత్రపతి యువజన సంఘం వారు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలపై చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమానికి పలువురు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి హైదరాబాద్ వైద్య నిపుణులు, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ డా. సాహితి, ఆర్ష్ మెడికల్ మేనేజింగ్ డైరెక్టర్ బి. కృష్ణ యాదవ్, స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి,అనంత అబిలాష్ రెడ్డి,దెంది శ్రీకాంత్ రెడ్డి, అల్వాల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆసరాగా ప్రజా ప్రతినిధులు


ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

**నవాబుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** గ్రామ నాయకుని తండ్రి అంత్యక్రియలకు ఆసరాగా గ్రామ ప్రజా ప్రతినిధులు రూ.15 మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డి ఆధ్వర్యంలో కారూర్ గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల శంకర్ కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు అంత్యక్రియలకు రూ. 5 వేలు ఖర్చుల నిమిత్తం అందించారు. మండల పరిధిలోని కారూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింలు తండ్రి లోకిరావు రామయ్య బుధవారం అనారోగ్యంతో మరణించగా వారికి ఆర్థిక సహాయంగా గ్రామ ప్రజాప్రతినిధులు వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ముకుందం, రాంరెడ్డి యాదిరెడ్డి జైపాల్ రెడ్డి లక్ష్మారెడ్డి తిర్మలయ్య, ఊరటి చెన్నయ్య, సి.నర్సిములు,రమేష్, సలాం చెన్నయ్య, వెంకటేష్ కృష్ణయ్య రమేష్ గ్రామస్తులు ఉన్నారు.

## బోరు మోటర్ సౌకర్యంతో తాగునీరు సరఫరా


బోరు మోటారు ద్వారా తాగునీరు సరఫరా

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** గతంలో పాడైపోయిన బోరు బావులలో బోరు మోటార్లను బిగించి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గతంలో పరిపాలించిన ప్రత్యేక అధికారుల పాలన సమయంలో గ్రామాలలో తాగునీరు అందించకుండా నిరక్ష్యం వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించి తాగునీరు అందిస్తున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీలోని రెండో వార్డులో బోరు బావిద్వారా తాగునీరు అందిస్తున్నారు. గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు, రెండో వార్డు సభ్యులు ఉస్మాన్ లు ప్రత్యేక దృష్టి సారించి పాడు పడి ఉన్న బోరు లో మోటర్ బిగించి తాగునీరు సరఫరా చేశారు. దీంతో రెండో వార్డులో ఉన్న ప్రజలు బోరు బావి నుంచి బోరు మోటర్ ద్వారా తాగునీరు అందడంతో కాలనీవాసులు సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, వార్డు సభ్యులు ఉస్మాన్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరచాలి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

**గద్వాల ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి సి.యం కప్ పోటీలలో క్రీడా స్ఫూర్తితో పాల్గొని, కష్టపడి ఉత్తమ ప్రతిభ కనబరచాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు ఆకాంక్షించారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సి.యం. కప్ పోటీలకు హాజరయ్యే జిల్లా క్రీడా కారుల బృందాన్ని ఐడీఓసీ ఆవరణం లో గురువారం అదనపు కలెక్టర్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల,జిల్లా స్థాయిలో విజ యం సాధించిన క్రీడాకారులను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలనన్నారు. క్రీడల ద్వారా క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని,గెలుపు మాత్రమే లక్ష్యం కాకుండా పాల్గొనడం కూడా ముఖ్యమని తెలిపారు. ఓటమికి భయప డకుండా నిరంతరం ప్రయత్నం చేయాలని, ప్రయత్నమే విజయానికి మార్గమని అన్నారు. పోటీల కు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజనం వంటి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈరోజు సుమారు 400 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరుతున్నట్లు తెలిపారు. వారు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి విజయాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి కృష్ణయ్య,క్రీడాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లల విద్యపై దృష్టి పెట్టాలి


పిల్లల చదువుపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**వీపనగండ్ల ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షలు ఆసన్నమవుతున్న సందర్భంలో పిల్లల తల్లిదండ్రులు వారిపై దృ ష్టి సారించి చదువులో ఎక్కువ మార్కులు తెచ్చుకొని ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకునే విధంగా కృషి చేయాలని జెడ్పిహెచ్ఎస్ వీపనగండ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాను ప్రకాష్ కోరా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల యొక్క వార్షిక పరీక్షలు మార్చు 14 నుండి ప్రారంభమవుతున్న సందర్భంలో పాఠశాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులు యొక్క ఇళ్లను సందర్శించి పేరెంట్స్ తో ముఖాముఖి మాట్లాడి విద్యార్థుల యొక్క పర్ఫామెన్స్, చదువు పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు సూచనలు చేశారు. కావలసినటువంటి వసతులు కల్పించి పాఠశాలకు రెగ్యులర్ వచ్చే విధంగా, పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా తల్లిదండ్రు లు కృషి చేయాలని సూచించడం జరిగింది. జనవరి 21 శనివారం నాడు జరిగే పేరెంట్ టీచర్ మీటింగ్ కు అందరి తల్లిదండ్రులు హాజరు కావలసిందిగా తెలిపారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి


ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని లోకిరేవు గ్రామంలో గురువారం ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. లోకి రేవు గ్రామ యువకులు ప్రజా ప్రతినిధులు ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి పక్కనే ఉన్న డా.బి.ఆర్అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చత్రపతి శివాజీ మహారాజ్‌కి జై నినాదాలతో లొకిరేవు చౌరస్తాలో హోరెత్తించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని, రక్తదానశిబిరం ఏర్పాటుచేసి యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ నిజమైన హిందూ నాయకుడని, హిందూ ధర్మ రక్షణ కోసం, సమానత్వము స్వరాజ్య స్థాపన కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువ నాయకులు బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు, గ్రామ సెక్రెటరీ రాందాస్, సర్పంచ్ దర్పల్లి అనసూయ యాదయ్య, చింతకింది రాములు, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సెక్రెటరీ గణేష్ చారి, శ్రీను వివిధ పార్టీ నాయకులు గుండేటి యాదయ్య, సురేందర్, యన్మన్గండ్ల రఘు, మాజీ సర్పంచ్ హనుమంతు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**మూసాపేటలో..**

**మూసాపేట్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా చక్రపూర్ గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ గంటెల రఘురాములు శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సందర్భంగా చక్రాపూర్ గ్రామ చత్రపతి శివాజీ కమిటీ సభ్యులు శివాజీ సేవలను కొనియాడారు. కోట్లాది భారతీయులకు స్ఫూర్తి, మరాఠా వీరయోధుడు, భరతమాత ముద్దుబిడ్డ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఇవే మా హృదయపూర్వక అభినందనలు అని మనస్ఫూర్తిగా స్మరించారు. శివాజీ మహారాజ్ జీవితం ప్రతి ఒక్క భారతీయుడికి మార్గదర్శకం. స్వరాజ్య స్థాపన కోసం ఆయన చేసిన పోరాటం, ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్మరణీయం. ఈ పవిత్రమైన దినం సందర్భంగా వారి ఆశయాలను మనం అందరం ఆచరణలో పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంటెల లక్ష్మీనారాయణ, చిన్న మల్లయ్య, ప్రకాష్ రెడ్డి, స్వామి గౌడ్, శేఖర్ గౌడ్, ధర్మేందర్, గోపాల్ గౌడ్, సూర్తి తాండ సర్పంచ్ గోపాల్ నాయక్, మొగులయ్య, గొరకొండ లక్ష్మణ్, భగవంతు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**దేవరకద్రలో..**

**దేవరకద్ర,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంగోపన్ పల్లి గ్రామంలో శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 1630లో మహారాష్ట్రలో జన్మించిన శివాజీ మహారాజ్ శూద్రులలో పుట్టి మహోన్నతమైన పరిపాలన అందించారని అన్నారు. మొఘలులతో పాటు పీష్వాలపై గెరిల్లా యుద్ధాలు చేసి, రైతుల సంక్షేమం, సమానత్వం, స్త్రీల పట్ల గౌరవం వంటి విలువలను కాపాడారని పేర్కొన్నారు. అష్టప్రధాన మండలి వ్యవస్థ,భూసంస్కరణలు, మతసామరస్యం ద్వారా ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ఆయన పాలన సాగిందని, అందుకే దాన్ని సురాజ్యంగా అభివర్ణిస్తారని తెలిపారు. అదేవిధంగా శివాజీ జయంతి సందర్భంగా గ్రామంలో శివాజీ విగ్రహం దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బాలరాజ్, ఉప సర్పంచ్ కోట్ల జ్యోతి,మాజీసర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కమ్మరి రామాచారి,కాంగ్రెస్‌పార్టీ గ్రామఅధ్యక్షుడు కుమ్మరి రాంబాబు,ఉత్సవ కమిటీ సభ్యులు కుమ్మరి బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పునుంతలలో..**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు మండలంలోని ఉప్పరిపల్లి, మర్రిపల్లి గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ఉప్పరపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యువజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం తదితర సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ అసోసియేషన్ ఉప్పరిపల్లి యువకులు, మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, అనంత అభిలాష్ రెడ్డి, దెంది శ్రీకాంత్ రెడ్డిలతో పాటు గ్రామ చత్రపతి శివాజీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**మర్రిపల్లిలో...** మండలంలోని మర్రిపల్లి గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మన హిందూ దేవాలయాల జోలికి వస్తే చత్రపతి శివాజీ మహారాజులు ఎదురుండి పోరాటం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ జయంతి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్తు భూపాల్ రావు, చత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్‌లో..**

**ఆత్మకూర్ ఫిబ్రవరి 19,ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో గురువారం రోజు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన విదుదలకుండా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు పురస్కరించుకుని హిందూ బంధువులు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి హిందూ బంధువులకు ఆదర్శంగా నిలిచిన చత్రపతి శివాజీ జీవిత ఆశయాలను కొనసాగించేందుకు యువత ప్రతిన బోనాలని ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా విజ్ఞప్తి చేశారు. అంతకుముందుగా మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు మండల రామకృష్ణ, అశ్విని కుమార్,, మండల సురేష్, రాజు, ఆత్మకూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

**శివాజీ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ**

**ఖిల్లా గణపురం ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఖిల్లా అఖిలపక్షం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేటి యువతకు శివాజీ వీరోచితమైన ధైర్య సాహసాలు పోరాటాలు ఆదర్శనీయంగా తీసుకోవాలని అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం పక్కన శివాజీ విగ్రహ స్థాపనకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల సర్పంచులు, యువకులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కేటిదొడ్డిలో..**

**కెటిదొడ్డి ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ముందు ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ చిత్రపటానికి మండల అధ్యక్షుడు ఆర్ ఉరుకుంద పూలమాలవేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధేవిధంగా దేవాలయం నుంచి యూత్ సభ్యుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన "చత్రపతి శివాజీ మహారాజ్ "జయంతి బైక్ ర్యాలీ తో పురవీధులలో చత్రపతి శివాజీ ఊరేగింపు బైపాస్ రోడ్డు వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, ఉప సర్పంచ్ ఇ.వీరన్న, వీరేష్, ఇ.యుగంధర్ , శ్రీకాంత్, వార్డు సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు చత్రపతి శివాజీ యూత్ సభ్యులు, గ్రామస్థులు యువత తదితరులు ఉన్నారు.

**శివాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి**

**ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డా. కుమారస్వామి**

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** బహుజన చక్రవర్తి శివాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డా. కుమారస్వామి కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డా. కుమారస్వామి పాల్గొని మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ శూద్రుల లో పుట్టి మహోన్నతమైన పరిపాలన మొఘల్ పైపోరాడటమే కాకుండ పీష్వాల పై గెరిల్లా యుద్ధం చేశాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.పర్వతాలు, డా.సుదర్శన్ రెడ్డి, డా.రవికుమార్, రవీందర్, ఎస్ఎఫ్ఐ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షులు బత్తిని రాము, శేఖర్, పరమేష్, వినోద్, రమేష్, అంజి, రాకేష్, మహేష్, కీర్తి, శ్రావణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

**చిన్న చింతకుంటలో..**

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** ధీరత్వానికి ప్రతీకగా నిలిచే ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు మండలంలోని ఆయా గ్రామాలలో సంబరంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించి, పరిపాలన దక్షుడిగా హిందూ సంస్కృతి సంప్రదాయాలకు పాటిస్తూ సర్వ మతాలను గౌరవిస్తూ ముందుకు సాగిన మహావీరుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. నేటి యువతకు ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శనీయమని వారు తెలిపారు. లాల్ కోట, గూడూరు, తిరుమలాపూర్, అప్పంపల్లిలతోపాటు ఆయా గ్రామాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సూర్యవంశ ఆరెకటికే సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఛత్రపతి శివాజీ శోభయాత్ర పురవీధుల గుండావైభవంగా కొనసాగింది.


ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్


శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ నిర్వహించిన దృశ్యం


ఉత్సవాలు జరుపుకుంటున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు


ఛత్రపతి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పియు బృందం


ఉప్పరిపల్లి లో ఛత్రపతి శివాజీకి ఘనంగా నివాళులు


ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న సర్పంచ్ సత్తు భూపాల్ రావు


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

### ఉప్పునుంతల పీఎం శ్రీ పాఠశాలలో

## మాక్ పార్లమెంట్ కార్యక్రమం



ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా మాక్ పార్లమెంట్ ( నమూనా పార్లమెంట్) కార్యక్రమం అత్యంతంగా ఉత్సాహంతో నిర్వహించారు. విద్యార్థులకు భారతదేశం పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించారు. ఈ నమూనా పార్లమెంటు కార్యక్రమంలో విద్యార్థులు, వివిధ రాజ్యాంగబద్ధమైన పదవులను అలంకరించి, సభ నిర్వహణ తీరును కళ్లకు కట్టే విధంగా నిర్వహించారు. పార్లమెంటు మాక్‌లో పార్లమెంటు స్పీకర్‌గా అక్షిత,భారత రాష్ట్రపతిగా సంజన, ఉప రాష్ట్రపతిగా చరణ్ కుమార్, భారత ప్రధాన మంత్రిగా కిషోర్ వ్యవ హరించారు. ఈ సందర్భంగా రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ సభలో ప్రశ్నలు అడగడం, ప్రతిపక్షాల విమర్శలు, ప్రభుత్వ వివరాలు వంటి అంశాలను విద్యార్థులు ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించాలని ఆయన కోరారు. విద్యార్థులు ప్రజా సమస్యలపై చర్చలు, ప్రశ్నలు సమాధానాలు, బిల్లుల ఆమోదం వంటి అంశాలను స్వయంగా తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులను, దేశ పరిపాలన, రాజ్యాంగం పట్ల ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మెంటర్ టీచర్లుగా బిల్కీస్, కవిత, గోపి లు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల పద్యాలు నీలం శ్రీధర్, పోకల సతీష్, శ్యాంసుందర్ గౌడ్, అజ్మతుల్లా, శ్రీనివాసులు, మల్లారెడ్డి, లక్ష్మణ్, గోపి, రాజ వర్ధన్ రెడ్డి, వీరోజు రాజు, శ్యామల గౌరీ, కల్పన, కవిత శ్రీలత ,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కెటిదొడ్డి మండల తహాశీల్దార్ కరణాకర్


బాధ్యతలు స్వీకరించిన కరణాకర్

**కెటిదొడ్డి ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాయబ్ తహశీల్దారు, తహశీల్దార్ల బదిలీ ల భాగంగా కేటి దొడ్డి మండల "తహశీల్దార్ "గా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ గద్వాల్ మండల తహశీల్దార్ కార్యాలయాని కి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో గద్వాల కలెక్టరేట్ లో "నాయబ్ తహశీల్దారు" గా విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ కెటిదొడ్డి మండల తహశీల్దార్ కార్యాలయానికి "తహశీల్దార్" గా కరుణాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ కు సంబంధించిన భూసమస్యలు, మిస్సింగ్ నెంబరు, టి ఎమ్ 33, వంటి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆయన అన్నారు.అధే విధంగా మండల పరిధిలోని రైతులు, ప్రజా ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే నూతన "తహశీల్దార్" గా కరుణాకర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా "తహశీల్దార్" కార్యాలయం సిబ్బంది శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి శివశంకర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్,ఆర్ ఐ నాగేష్ , రికార్డు అసిస్టెంట్, వివిధ గ్రామాల గ్రామ పరిపాలన అధికారులు, కంప్యూటర్ ఆపరేటిటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు


శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే

**గద్వాల ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని గద్వాల ఎమ్మెల్యే దంపతులు బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను అందుకు న్నారు. తెలంగాణ ర్నాష్ట్రలో గద్వాల నియోజకవర్గంలోని ప్రజలు, రైతాంగం దినదిన అభివృద్ధి చెందాలని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా శ్రీవారిని కోరుకోవడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రభుత్వంలో నే మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని,మహిళా సాధికారతకు కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అని టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని మారుతినగర్ 20వ వార్డులో మహిళలు, పలువురు చేపూరి జయమ్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బర్కతుల్లా, రాధిక, గిరిజ, లక్ష్మి, జ్యోతి,భాగ్య, కృష్ణవేణి, సుగుణతో పాటు 20మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ రామనాథం, తిప్పర్తి నరసింహారెడ్డి, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడుపాల గోపాల్‌రెడ్డి,కటకం రఘురాం, శ్రీనివాసాచారి, విశ్రాంతి ఉద్యోగి అంజయ్య పాల్గొన్నారు.

## గీతం యూనివర్సిటీకి పీయూ జట్టు



ఆంధ్రప్రదేశ్ బయలుదేరిన పాలమూరు యూనివర్సిటీ చెస్ బాలికల జట్టు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నిర్వహించే సౌత్ జోన్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో భాగంగా పాలమూరు యూనివర్సిటీ చెస్ ఉమెన్స్ టీం ఆంధ్రప్రదేశ్ లోని గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ ఉమెన్ ఛాంపియన్‌షిప్ లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ చెస్ బాలికల జట్టు బయలుదేరింది. నేటి నుంచి మూడు రోజులపాటు పోటీలు జరగనున్నాయి. ఇందులో ఎంపికైన క్రీడాకారులను పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ క్రీడాకారులను అభినందించి ట్రాక్ షూట్, టీం యూనిఫామ్ లను అందించి క్రీడల్లో మంచి ప్రదర్శన కనబరచాలని కోరారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు క్రీడాకారులను పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విజయంతో పాలమూరు యూనివర్సిటీ పేరు ప్రఖ్యాతలను క్రీడల్లో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. ఎన్ చంద్ర కిరణ్ , యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు, చెస్ కోచ్ డాక్టర్ సిహెచ్ రాకేష్ లతో పాటు క్రీడాకారులు ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే నా కర్తవ్యం

● మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్



చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సీఎం సురేష్

**అయిజ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మున్సిపాలిటీలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన కర్తవ్యం మని నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ పేర్కొన్నారు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ తో కలిసి చైర్మన్ చాంబర్లో పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు పురోహితులు పూర్ణ కుంభంతో నూతనంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లను ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి దేయంగా తాను పనిచేస్తానని ప్రజలు తమకు ఇచ్చిన ఈ గౌరవాన్ని వమ్ము చేయకుండా వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటూ వారికి సాయం సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధికై రాజకీయాలను పక్కన పెట్టి తనతో ప్రజా ప్రతినిధులు ప్రజలుకలిసి రావాలని తెలిపారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాల నరసింహులు, మున్సిపల్ కమిషనర్ సైదులు, మేనేజర్ అశోక్‌రెడ్డి, ఆయా వార్డులకౌన్సిలర్.మున్సిపల్ సిబ్బంది. బిఆర్ఎస్ నాయకులు. కార్యకర్తలు. పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి19 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి గురువారం తెలిపారు. దేవరకద్ర మండలం రాకొండ గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మరికల్‌కు ఇసుకను తరలిస్తుండగా మండలంలోని బండర్ పల్లి వద్ద టిప్పర్ ను ఆపి తనిఖీ చేయగా ఇసుక తరలింపుకు ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో అట్టి ఇసుకటిప్పరును పట్టుకొని స్టేషన్ తరలించడం జరిగిందనిఆయన తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌యజమాని దారముని శ్రీనివాసులు, డ్రైవర్ దేశాయి నవీన్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం




జూపల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకి సోదరులు

**కొల్లాపూర్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కొల్లాపూర్ మున్సిపాలిటీలో బీసీ సామాజిక వర్గవాల్మీకి అయిన రెడ్డి జ్యోతి సత్యం కు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ మున్సిపాలిటీ చైర్మెన్ పదవి ఇచ్చినందుకు చిన్నంబావి మండల వాల్మీకి సంఘం అధ్యక్షులు ఉమేష్ నాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటానికి క్షీరాభిషేకం చెయ్యడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ జూపల్లి కృష్ణారావు వాల్మీకిలను సోదర భావంతో చూస్తూ... వాల్మీకి బోయలకు చైర్మెన్ పదవి ఇచ్చిన జూపల్లికి రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేసారు. వాల్మీకి తాలూకా అధ్యక్షుడు శివ రాజు కుమార్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగారి శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గంలో రాజకీయంగా గుర్తింపు లేని వాల్మీకి కులాని గుర్తించరన్నారు అన్నారు. బోయలను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న ఏకైక నాయకుడు మంత్రి జూపల్లి కృష్ణారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల అన్ని గ్రామాల వాల్మీకి సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు

**వెల్దండ, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా పురుగులతో కూడిన భోజనాన్ని అందించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కార్తీక్ ఆధ్వర్యంలో గురుకుల విద్యాలయాన్ని సందర్శించి వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం భోజనం అందించాలని,విచారణ జరిపించి ప్రిన్సిపాల్ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకుల రామార్జున్, సుమన్, అర్జున్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## సేవాలాల్ జీవితం సమాజానికి ఆదర్శప్రాయం

● జ్ఞానజ్యోతిని వెలిగించిన ఆధ్యాత్మిక గురువు ● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి



సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



**బిజినేపల్లి, ఫిబ్రవరి19 ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ జీవితం యావత్ సమాజానికి ఆదర్శప్రాయం అని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మూడు కోట్ల రూపాయలతో సంతు సేవాలాల్ మహరాజ్ గిరిజన భవనానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ లంబాడీల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. ప్రజల మేలు కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. వీటిలో ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం క్షేత్రధర్మాన్ని రక్షించడం వంటివి ప్రధానమైనవి అన్నారు. యువత సేవాలాల్ బాటలో నడవాలని, యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా భక్తి మార్గాల వైపు నడవాలని సూచించారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారని తెలిపారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేసి, ఊరికి దూరంగా అడవిలో స్థిరమైన తండా వ్యవస్థను పటిష్ఠంగా నిర్మాణంచేశారని చెప్పారు. మూఢనమ్మకాలు, హింస, మద్యపానం మొదలైన వ్యసనాలకు బానిస కాకుండా స్వచ్ఛమైన జీవనం కొనసాగించాలని ఆయన బంజారాలకు హితోపదేశం చేశారని,బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారని చెప్పారు.ఈ కార్యక్రమంలో గిరిజన సాంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి భవన నిర్మాణానికి పూజ చేశారు. గిరిజన సంఘం నాయకులు గోపాల్ నాయక్,మాన్యనాయక్, గోవిందనాయక్,బాలు,పాండు, జయరామ్, గురుస్వామి,బిజినేపల్లి సర్పంచ్ ఇందిరా రాములు, ఆయా గ్రామాలప్రజాప్రతినిధులుగిరిజనసంఘంనాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభ్యున్నతి కోసం కృషి

● జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**రాజాపూర్, ఫిబ్రవరి19 ప్రభాతవార్త:** మహిళా సంఘాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. గురువారం రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ, అగ్రరారం పొట్లపల్లి, బీబీనగర్ తాండలో నూతనంగా నిర్మించనున్న మహిళా సమైక్య భవనాల నిర్మాణాలకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే రంగారెడ్డి గూడలో అంతర్గత మురుగు నీటి కాలువ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి, ఆత్మనిర్భరత కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. మహిళా సమైక్య భవనాలు మహిళలకు సమావేశాలు,శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు,పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● పీఎం శ్రీ, బిసి శ్రీరంగాపూర్ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ బృందం



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ బృందం

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి19 ప్రభాతవార్త:** గురువారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీపాఠశాలను, బిసిశ్రీరంగాపూర్ పాఠశాలను జిల్లా విద్యాశాఖ బృందం తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యాన్ని పరిశీలించారు. తరగతుల వారీగా ప్రారంభ పరీక్ష మొదలుకొని నిర్మాణాత్మక మూల్యాంకనం 3 వరకు అన్ని పరీక్షల ప్రశ్నాపత్రాలు మార్కులు, సీసీఈ రిజిస్టర్లు ఆన్లైన్లో నమోదు చేసిన మార్కులను ప్రశ్నపత్రాల్లో ఉన్న మార్కులను సరి పోల్చి చూశారు. ప్రతి తరగతిని సందర్శించి పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్కులు, నోటు పుస్తకాలను చెక్ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి పాఠశాలలోఉన్న కిచెన్ గార్డెన్, ప్రీ ప్రైమరీ అవుట్‌బోర్డ్ సామాగ్రి,బోధన అభ్యసన పరికరాలు, గ్రంథాలయ పుస్తకాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఇద్దరు ఉపాధ్యాయుల ఆదర్శ బోధనను పరిశీలించి నమోదు చేసుకొని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.పాఠశాల అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు పాఠశాలకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన బృందం ఓవరాల్గా పాఠశాల నిర్వహణ విద్యార్థుల సామర్థ్యాలు బాగున్నాయని చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.రిజిస్టర్లు రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. తనికి బృందం నోడల్ అధికారిని ప్రేమలత సభ్యులు జితేందర్ నరేందర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు మోహన్ రాజు, ఉపాధ్యాయులు వసంతపురం రాజు, దామోదర్ బాబు, బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ బేగం, ప్రీప్రైమరి సిబ్బంది పాల్గొన్నారు.



## అక్రమ కేసులకు భయపడేది లేదు

● ప్రజల పక్షాన పోరాడుతాం : మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్




సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**ఖిల్లాగణపురం ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని ప్రజల పక్షాన టిఆర్ఎస్ పోరాడుతుందని మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్‌పై ఫోన్‌గ్యాపింగ్ అక్రమ కేసుబనాయించిందని నోటీసులు అందజేయడం సరైన పద్ధతి కాదని రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు రాస్తారోకాలు చేపట్టామని తెలంగాణ జాతిపితగా పిలవబడే కేసీఆర్కు నోటీసులు ఇవ్వడం టిఆర్ఎస్ అభిమానులు కాంగ్రెస్‌పార్టీ తోపాటు ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను తగలబెట్టడం జరిగిందని. ఏ పార్టీలు అధికారంలో ఉన్నా కూడా ప్రతిపక్షంలో ఉన్నారు అధికార పక్షంపై పోరాటం చేస్తారని గతంలో కాంగ్రెస్ పార్టీ వారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇలాంటి పనులు చేపట్టలేదా అని విమర్శించారు.పోలీసులు తమపై అక్రమంగా ఎవరో చెప్పిన మాటలు విని కేసులు బనాయించడం సరైన పద్ధతి కాదన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి కేసులకు భయపడేది లేదని రెట్టించిన ఉత్సాహంతో ఇంకా పోరాడుతామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సామ్యా నాయక్. సురేందర్ చిన్న ఆంజనేయులు గౌడ్,శ్రద్ధాంజలిగౌడ్ గోపాల్ మన్నెంగౌడ్,రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## చేనేత కళాకారుల నుండి దరఖాస్తులకు ఆహ్వానం

**గద్వాల ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** శ్రీ కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆవార్డ్ 2026 కోసం చేనేత కళాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులకు పురస్కారాలను అందించడం జరుగుతుందని తెలిపారు. పోచంపల్లి ఇక్కత్,డ్రెస్,జనరల్ వెరైటీస్ ,నారాయణ పేట,గద్వాల చీరల నేత పని రకాల్లో నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ పురస్కారాలకు అర్హులని చెప్పారు. వీవింగ్ కేటగిరీలో 2025 డిసెంబర్ 31 నాటికి 30 సంవత్సరాల వయస్సు నిండి,వృత్తిలో పదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిజైనింగ్ కేటగిరీలో 2025 డిసెంబర్ 31 నాటికి 25 సంవత్సరాల వయస్సు నిండి, వృత్తిలో ఐదేళ్ల కనీసం అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు,కళాకారులు తయారు చేసిన పూర్తి వస్త్రమును శాంపిల్ గా గద్వాలలోని ఏడి ఓసిలో ఉన్న చేనేత మరియు జౌళి శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇందులో విజేతలైన చేనేత కళాకారులకు రూ. 25,000/ ల నగదు పురస్కారము, ప్రశంశా పత్రము మరియు మెమెంటోతో పాటుగా శాలువాతో సత్కారం మొదలగునవి బహుకరించబడుతాయని తెలిపారు.ఎంపికకు దరఖాస్తు చేసుకున్న డిజైన్ ను గతములో ఎవరూ కూడా తయారు చేసి ఉండకూడదని స్పష్టం చేశారు.నమూనా కొరకు పంపించు వస్త్రము పూర్తిగా ఉండాలనన్నారు.నమూనాగా పంపే వస్త్రము అమ్మకం చేయరాదని,తయారు చేసిన వస్త్రము లేదా డిజైన్ తానే స్వయంగా రూపొందించినట్లుగా స్వీయ ధృవీకరణ పత్రము సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలు తమ కార్యాలయంలో లభిస్తాయని, మార్చి 31 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నియమించబడ్డ అవార్డు ఎంపిక కమిటీకి ప్రతిపాదనలుగా పంపించడం జరుగుతుందన్నారు.పురస్కారాలకు ఎంపికైన నమూనాలు అవార్డు ప్రధానం చేసిన తర్వాత సంబంధిత చేనేత కళాకారులకు పోస్టు ద్వారా తిరిగి పంపించనున్నట్లు వివరించారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్



**వెల్దండ, ఫిబ్రవరి19 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో పురుగులు అన్నం పెడుతున్నారని బుధవారం విద్యార్థులు రోడెక్కడంతో గురువారం తహసిల్దార్ కార్తీక్‌కుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులనీలతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్‌రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అంతర్గత మార్కుల నమోదు పరిశీలన

**నారాయణపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోమార్చిలో జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల దృష్ట్యాజిల్లాలో అంతర్గత మార్కుల నమోదు ప్రక్రియను పరిశీలించే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి స్కూల్లో విద్యార్థుల అంతర్గత మార్కులను పరిశీలన బృందం తనిఖీ చేసింది. విద్యార్థుల సామర్థ్యాన్ని ఆధారంగా తీసుకొని తెలుగు,హిందీ, ఆంగ్లము, గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాంఘిక శాస్త్రం వంటి ప్రతి సబ్జెక్టులో 20 మార్కుల నమోదు సక్రమంగా జరిగిందో లేదో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అంతర్గత మార్కుల నమోదు పరిశీలన బృందం సభ్యులు భారతి, భాను ప్రకాష్, మోహన్, లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని సమగ్రంగా అంచనా వేసేందుకు విద్యాశాఖ క్షేత్రస్థాయి పరిశీలన బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలప్ప, అమీనా, హెచ్.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## మారెమ్మ అవ్వ గుడి పూజ కార్యక్రంలో పాల్గొన్న సర్పంచ్

**గద్వాల ఫిబ్రవరి 19, ప్రభాతవార్త;** పెద్దపల్లి గ్రామంలో మారెమ్మ అవ్వ గుడినీ కొత్తగా నిర్మిస్తున్న సందర్భంగా గుడి నిర్మాణ పూజ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతు మన పెద్దపల్లి గ్రామం సురక్షంగా ఉండాలని, రైతన్నలకు పంటలు బాగా పండాలని, గ్రామం లో అందరు ఆయు ఆరోగ్యలతో బాగుండాలని, దుష్ట శక్తులనుండి కాపాడాలని ఆ మారెమ్మ అవ్వను వేడుకుంటు, గ్రామంను ఆదర్శ గ్రామంగా చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకుంటున్న 108,102 అంబులెన్స్‌లు

■ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవి

**వీపనగండ్ల ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 మరియు 102 అంబులెన్సు అత్యుత్తమంగా పనిచేస్తున్నాయని అపర సంజీవనిల ఆదుకుంటున్నయని 108 అంబులెన్స్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె రవి పేర్కొన్నారుగురువారం మండల కేంద్రంలోని108/102 అంబులెన్సును ఆకస్మికంగా తనిఖీ చేశారుఅంబులెన్స్‌లోని వివిధ రకాల పరికరాల పనితీరు మరియు మందులను పరిశీలించడం జరిగింది 108 అంబులెన్సు ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ప్రమాద బాధితులను ఆపదలో ఉన్న వారిని వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని పేర్కొన్నారు.102 అమ్మఒడి అంబులెన్సులు గర్భిణీ స్త్రీలను ప్రసవ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తిరిగి ఇంటికి చేర్చడం జరుగుతుంది ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన తర్వాత తల్లి బిడ్డలను ఇంటిదగ్గర ఉచితంగా దించడం జరుగుతుంది.ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ కోసం అమ్మఒడి వాహనాలను ఉపయోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108 మరియు 102 అంబులెన్సు ద్వారా ప్రజలకు వైద్య సహాయాన్ని అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెహబూబ్, రత్నం, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సాయి కుమార్, పైలెట్ శివయ్య పాల్గొన్నారు.

## త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఆత్మకూర్ ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బీసీ కాలనీలో త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలున్నట్లుగా ఆరో అవార్డు కౌన్సిలర్ భరత్ వెల్లడించారు. గురువారం రోజు ఆరో వార్డులోని మురుగు కాలువల తోడివేత పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కాలువలను శుభ్రం చేయించారు. గత నెల రోజులుగా కాలనీలో మురుగు కాలువల శుభ్రం చేయక పోవడం మూలంగా ప్రజలు దోమల బారిన పడి అంటువ్యాధులకు రవుతున్న విషయాన్ని తన దృష్టికి రావడంతో తక్షణమే స్పందించి కాలనీలోని మరుగు కాలువల పరిశుభ్రతకు యుద్ధ ప్రాతిపదిగా చర్యలు చేపట్టినట్లుగా ఆయన తెలిపారు. అంతేకాకుండా పట్టణానికి మంజూరైన ప్రత్యేక నిధులతో రాష్ట్ర మంత్రి వాకిడికి సరి ప్రకటించిన నేపథ్యంలో కాలనీలో అభివృద్ధి పనులకు త్వరలోనే శ్రీకారం చేపట్టి ప్రజలకు సౌకర్యవంతమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లుగా ఆయన తెలిపారు.

## మద్దిగట్లలో చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

**భూత్పూర్,ఫిబ్రవరి19,ప్రభాతవార్త:** మొగలుల నిరంకుశ, జాత్యహంకార దుష్చర్యల్ని అణిచివేసి,మరాఠీ సామ్రాజ్యాన్ని భారతావనిలో స్థాపించి,హిందూమతాన్ని దశదిశలా వ్యాప్తి చేసిన మరాఠా యోధుడు,హిందూవాది చత్రపతి శివాజీ మహారాజ్ నిలువెత్తు విగ్రహాన్ని భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామంలో గురువారం గ్రామస్థుల కోరిక మేరకు దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ మరాటా సామ్రాజ్యాన్ని స్థాపించేందుకు మొగలులను ఎదుర్కొని సామ్రాజ్యాన్ని విస్తరించిన మహాయోధుడు చత్రపతి శివాజీ అని అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపీపీ కదిరే శేఖర్‌రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మందడి నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే సామాజిక స్పృహ అవసరం

**బిజినేపల్లి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** బాల్యం నుండే పిల్లలకు సామాజిక బాధ్యత, స్పృహ, సామాజిక చైతన్యం అలవర్చుకోవాలని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ ఇంఛార్జి ప్రిన్సిపాల్ జి.జానకి రాములు సూచించారు. సామాజిక సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని, తన అభివృద్ధితో పాటు, ఆపదలో ఉన్న వారిని ఆదుకొనే అలవాటు చిన్నతనం నుండే రావాలని భాస్కరాచారి అన్నారు. వట్టెం నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ లోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిర అనాథ బాలికల ఆశ్రమం, జ్ఞాన సరస్వతి ఆలయ ఆవరణలోని అనాథ బాలుర ఆశ్రమంలలో బాల బాలికలకు దుప్పట్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. నవోదయ విద్యార్థులలో సామాజిక స్పృహ కల్పించిసమాజసేవలో బాధ్యులను చేయడంకొరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నవోదయ సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో జర్నలిస్టు నర్సింలు మృతి

**కోయిలకొండ ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కోయిలకొండకు చెందిన జర్నలిస్టు నర్సింలు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. నర్సింలు నమస్తే తెలంగాణ, ఆంధ్రప్రభ, సూర్య, నవతెలంగాణ వివిధ దినపత్రికలలో జర్నలిస్టుగా పనిచేశారు. ఈయన గత కొద్ది నెలలుగా అనారోగ్యం బారిన పడ్డారు. జర్నలిస్టు మిత్రులతో ఆప్యాయతతో మెలుగుతూ, రాజకీయ నేతలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ అందరి మన్ననలను పొందారు. విధి ఆడిన వింత నాటకంలో జర్నలిస్టు నర్సింలు తుది శ్వాస విడిచారు. జర్నలిస్టు నర్సింలు మృతికి రాజకీయ నేతలు , జర్నలిస్టులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

